నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

ఇల్లు కూల్చివేయడంతో సొమ్మసిల్లి పడిన బాధితురాలు

తమ ఇల్లు కూల్చివేయొద్దని అడిగిన చిన్నారిని అరెస్టు చేసి తీసు కెళ్తున్న పోలీసులు

చారకొండలో ఇండ్లను కూల్చివేస్తున్న జేసీబీ

విస్తరణం

చారకొండలో ఉద్రిక్తత

- పేదల ఇండ్లపైకి బుల్డోజర్
- బైపాస్ నిర్మాణానికి 29 ఇండ్లు నేలమట్టం
- పోలీసుల నిర్బంధం మధ్య దౌర్జన్యంగా నిర్మాణాల కూల్చివేతలు
- బాధితులు అడ్డుకున్నా కనికరం లేకుండా..
- చంటి పిల్లలను సైతం అరెస్ట్ చేసిన పోలీసులు
- దండం పెట్టినా దయలేకుండా ఈడ్చిపాడేస్తూ..
- కన్నీరుమున్నీరైన ఇండ్ల బాధితులు
- నోటీసులు ఇవ్వకుండా తొలగింపు ఏమిటని బాధితుల ఆగ్రహం

చారకొండ, ఫిబ్రవరి 4 : కాయకష్టం చేసి నిరుపేదలు ఇండ్లు నిర్మించుకుంటే తమ కండ్ల ముందే ఇండ్లను నేలమట్టం చేయడంతో బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి చారకొండ మండల కేంద్రం మీదుగా వెళ్తుంది. అయితే ఇందుకోసం బైపాస్ రోడ్డును వేయకుండా ప్రస్తుతం ఉన్న పాత రోడ్డునే విస్తరించాలని ప్రజలు, నిర్వాసితులు కోరుతున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల 29 ఇండ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూములు కోల్పోతున్నామని నిర్వాసితులు ఎన్నోసార్లు ఆందోళనలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునే కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బలగాలు మండల కేంద్రానికి భారీగా చేరుకున్నారు. ఒక్కసారిగా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బైపాస్ నిర్మాణంలో పోతున్న ఇండ్లను పోలీసులు చుట్టుముట్టి బాధితులకు ముందస్తుగా ఏలాంటి సమాచారం ఇవ్వకుండా జేసీబీల సహకారంతో ఇండ్లను నేలమట్టం చేశారు. తమకు అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వచ్చి దౌర్జన్యంగా కూల్చి వేస్తే మేము ఇప్పుడు మా సామాన్లు తీసుకొని ఎక్కడికి వెళ్లాలని బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. అధికారులు కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా తమను రోడ్డుపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీసం ప్లాటు కూడా కొనలేని దుస్థితి ఉందన్నారు. ఏకపక్షంగా అధికారులు వ్యవహరించి తమ ఇంట్లో సామగ్రి తీయకుండా కాంట్రాక్టర్ కూలీలతో సామాన్లు ట్రాక్టర్లలో తీసుకెళ్లి రైతు వేదిక, సింగిల్ విండో గోదాంలో ఉంచారని మండిపడ్డారు. ఈ సందర్భంగా తన ఇంటి కూల్చోదని గిరిజమ్మ అనే బాధితురాలు అధికారులను వేడుకున్నా.. బలవంతంగా ఆమె ఇంట్లోకి పోలీసులు ప్రవేశించి బాధితురాలితో పాటుఆమె ఇద్దరి కూతుళ్లను అరెస్టు చేసి వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం ఇంటిని కూల్చివేశారు. అదేవిధంగా యాదమ్మ అనే బాధితురాలు తన ఇంటిని కూలుస్తున్న సమయంలో స్పృహతప్పి కింద పడిపోయింది. తీవ్ర ఉద్రిక్తత మధ్య బైపాస్‌లో నిర్మాణంలో అడ్డుగా ఉన్న ఇండ్లను పూర్తిగా తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక ఎస్సై శంషోద్దీన్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్డీవో వెంట తాసీల్దార్ సునీత, ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్, ఎన్‌హెచ్ డీఈ రమేశ్, అర్‌అండ్‌బీ ఈఈ కరుణాకర్, విద్యుత్ ఏఈ జానీరాంనాయక్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇల్లు కూల్చి రోడ్డుపాలు చేశారు..

సమాచారం ఇవ్వకుండా అధికారులు నా ఇంటిని చుట్టుముట్టి పోలీసుల బలగాలతో ఇల్లు కూల్చారు. మేమే మా సామాన్లు తీసుకుంటామని కొంత సమయం ఇవ్వండని మొర పెట్టుకున్నా బలవంతంగా వాళ్లే వ్యాన్‌లో సామాన్లు తీసుకెళ్లి రైతు వేదికలో వేశారు. ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించకుండా ఇలా కూల్చి వేస్తే మేము మా పిల్లలు ఎక్కడికి పోవాలి. గూడు లేకుండా చేస్తే ఎక్కడ ఉండాలి. ప్రభుత్వం ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి.

-నల్ల రాములమ్మ, చారకొండ

సమాచారం ఇవ్వకుండా కూల్చేశారు..

కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలో బైపాస్‌లో నా ఇల్లు కూల్చివేశారు. మా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న సామన్లు బయటికి వేశారు. నాకు కనీసం నోటీసు కానీ సమాచారం కూడా ఇవ్వలేదు. ఇంత దౌర్జన్యంగా వచ్చి పోలీసులు జేసీబీతో ఇల్లు కూల్చడం సరికాదు. నాకు 262గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే 218గజాలకే పరిహారం ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు మళ్లీ సర్వే చేసి నాకు పూర్తి పరిహారం అందించి ఆదుకోవాలి. లేదంటే ఆర్థికంగా నా కుటుంబం చితికిపోడం ఖాయం.

- నూనె విష్ణు, మర్రిపల్లి, చారకొండ మండలం

రైతులను ఆదుకోవాలి

పెద్ద ధన్వాడలో రైతుల నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతున్న సీపీఎం జిల్లా నాయకులు

రాజోళి, ఫిబ్రవరి 4 : ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేస్తూ రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు కోసం పెద్ద ధన్వాడలో రైతులు చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం 13వ రోజు చేరుకున్నాయి. రైతుల దీక్షకు సీపీఎంతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే పచ్చని పంట పొలలాను నాశనం చేయడమే కాకుండా ప్రభుత్వం రైతుల నోట్లో మట్టికొడుతున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయక పోతేపెద్ద ఎత్తున నిరసనలు తప్పవని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రూ.90 కోట్లు టోకరా

- పోలీసుల అదుపులో నిందితుడు
- పామిసరి నోట్లు, చెక్కులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

కేసు వివరాలు వెల్లడిస్తున్న కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 4 : అత్యధిక వడ్డీ ఇస్తామని ఆశజూపి దాదాపు రూ.90కోట్లు టోకరా వేసి పరారైన నిందితుడిని మంగళవారం కల్వకుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ. లక్షకు ఆరు నెలల వ్యవధిలో యాభై వేలు అదనంగా వడ్డీ ఇస్తామని ఆశజూపి పెద్దఎత్తున బాధితుల నుంచి డబ్బులు తీసుకొన్న ముజామిల్ ఆ తర్వాత ముఖం చాటేశాడు. అతడి చేతులో మోసపోయిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా వారు నిందితుడిని అరెస్ట్ చేసి వివరాలు వెల్లడించారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశం నిర్వహించి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన ముజామిల్ పట్టణంలోని మసీదులలో నమాజ్ చేయిస్తుండేవాడు. మసీదుకు వచ్చిన వ్యక్తులతో మెల్లగా పరిచయాలు పెంచుకొని వారితో తక్కువ కాలంలో అత్యధిక వడ్డీ వచ్చే ఆలోచనలు తనవద్ద ఉన్నాయని వారిని నమ్మించాడు. అలా నమ్మిన వ్యక్తుల నుంచి 2020-2023 వరకు 24మంది ఏజెంట్లను పెట్టుకొని దాదాపూ రూ.90 కోట్ల వరకు రియల్ ఎస్టేట్, ట్రేడింగ్‌లలో పెట్టుబడులు పెట్టి మొదట్లో పెట్టుబడులు పెట్టిన వారికి రూ.లక్షకు లక్షయాభై వేల చొప్పున చెల్లించడంతో ఆశపడి మరికొందరు అతడిని, అతడి కుటుంబసభ్యుల మాటలు నమ్మి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు డబ్బులు చెల్లించారు. కొంతకాలానికి ముజామిల్ అకస్మాత్తుగా అతడు కల్వకుర్తి పట్టణాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టారు. మంగళవారం ఉదయం కల్వకుర్తి పట్టణంలో ఉన్నాడన్నా పక్కా సమాచారంతో అతడిని అదుపులోకి తీసుకొని, అతడి నుంచి ప్రామిసరి నోట్లు, చెక్కులను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ముజామిల్ పైన గతంలో రెండు కేసులున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సమావేశంలో సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథపై స్పెషల్ డ్రైవ్

గోపాలపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో మంగళవారం మిషన్ భగీరథ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మిషన్ భగీరథ డీఈ హరీశ్ కుమార్, ఏఈ రాకేశ్‌కుమార్‌తో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి మంచి నీటి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, మిషన్ భగీరథ నీటిపై నమ్మకం కలిగేలా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎంత మంది మిషన్ భగీరథ నీళ్లు తాగుతున్నారు..నల్లా కనెక్షన్ లేని చోట గ్రామంలో తాగునీరు అందించేందుకు బోర్లు ఉపయోగంలో ఉన్నావా, లేవా అన్న వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్ ఆదేశాలమేరకు జిల్లా మిషన్ భగీరథ యంత్రాంగం అప్రమత్తమైంది. క్షేత్ర స్థాయిలో మిషన్ భగీరథ పథకంలో ఉన్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం, మిషన్ భగీరథ లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు.

అంతర్రాష్ట్ర సందెరాళ్ల పోటీలు

అయిజ, ఫిబ్రవరి 4 : మండలంలోని టీటీదొడ్డిలో గుండ్ల భీమరాయుడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర సందెరాళ్లు ఎత్తు పోటీలు ఆకట్టుకున్నాయి. మంగళవారం గుండ్ల భీమరాయుడు ఆలయ ప్రాంగణంలో సందెరాయి, దొబ్బుడు గుండు, గుబ్బల గుండు, ఇసుక సంచి ఎత్తు పోటీలు నిర్వహించారు. సందెరాయి ఎత్తుపోటీలో రాయిచూర్ జిల్లా, గుడుబల్ల గ్రామానికి చెందిన సూరి మొదటి స్థానంలో నిలువగా, అయిజ మండలం, మేడికొండ గ్రామానికి చెందిన రాజు రెండో స్థానంలో నిలిచారు. గట్టు మండలం, ఇందువాసి గ్రామానికి చెందిన పరశురాముడు మూడో స్థానంలో నిలిచారు. దొబ్బుడు గుండు ఎత్తు పోటీలో కప్పగల్ గ్రామానికి చెందిన కర్ణ మొదటి స్థానంలో నిలువగా మాచీపురం గ్రామానికి చెందిన బాలరాజు రెండో స్థానంలో నిలిచారు. గుబ్బల గుండు ఎత్తు పోటీలో సోమలగూరుకు చెందిన బోయ శివ మొదటి స్థానంలో నిలువగా, అదే గ్రామానికి చెందిన గజ్జన్న రెండో స్థానంలో నిలిచారు. ఇసుక సంచి ఎత్తు పోటీలో దేవదుర్గకు చెందిన మహేశ్ మొదటి స్థానంలో నిలువగా, ముసరికల్‌కు చెందిన మహేశ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. విజేతలకు ఆలయ కమిటీ నగదు బహుమతులను అందజేశారు.

సందెపురాయి ఎత్తుపోటీలో విజేతగా నిలిచిన సూరి

వేముల పాఠశాలలో నిలిచిన మధ్యాహ్న భోజనం



వేముల పాఠశాలలో మధ్యాహ్నం మూడు గంటలకు భోజనం చేస్తున్న విద్యార్థులు

- ఆకలితో అలమటించిన విద్యార్థులు
- 3 గంటలకు భోజనం వండిపెట్టిన ఉపాధ్యాయులు
- ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మధ్య వివాదం కారణం

మిడ్జిల్, ఫిబ్రవరి 4 : మండలంలోని వేముల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బంద్ చేశారు. అయితే హెచ్ఎం, వంట ఏజెన్సీ వారి మధ్య గొడవ జరగడంతో వారు వంట చేయకుండా వెళ్లిపోయారు. దీంతో మధ్యాహ్న భోజనం నిలిచిపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. కొంత మంది విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనాలు చేసి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీల మధ్య జరిగిన గొడవలో విద్యార్థులను పస్తులు ఉంచడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని వెంటనే ఎంఈవో సుధాకర్‌కు తెలుపగా ఎంఈవో, ఎంపీడీవో గీతాంజలి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సరస్వతి పాఠశాలకు చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అయితే వంటగది తాళం వంట ఏజెన్సీవారు ఇవ్వకపోవడంతో తాళం పగుల కొట్టి ఉపాధ్యాయులే స్వయంగా వంట చేసి విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ఐదు మంది ఉపాధ్యాయులు, 39 మంది విద్యార్థులకు గానూ 13 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలకు వచ్చారు. అయితే ఉపాధ్యాయులు, వంటఏజెన్సీల నిర్లక్ష్యంతో ఒంటిగంటకు భోజనం చేయాల్సిన విద్యార్థులు.. 3గంటల సమయంలో భోజనం చేశారు. అనంతరం ఎంపీడీవో, ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్ఎం సమక్షంలో ఇరువురితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. మళ్లీ ఇలాంటి చర్యలు పునరావృతం కావొద్దని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎం, వంట మహిళలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

రూ.నాలుగు లక్షలు చోరీ

- నారాయణపేటలో ఘటన

నారాయణపేట, ఫిబ్రవరి 4 : నిలిపి ఉన్న బైక్‌కు డబ్బులతో ఉన్న బ్యాగు తగిలించగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మంగళవారం పేటలో చోటు చేసుకున్నది. ఎస్సై వెంకట్ శ్వేర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దామరగిద్ద మండలం కాన్‌కుర్తి గ్రామానికి చెందిన ఆంజనేయులు పట్టణంలోని ఓ బ్యాంకులో రూ.4లక్షలు డ్రా చేసుకొని తన మోపెడ్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో పట్టణంలోని చౌక్ బజార్ వద్ద ఉన్న బేకరీలో కేక్ కొనుగోలు చేసేందుకు మోపెడ్‌ని బేకరీ ఎదురుగా నిలిపి అందులోకి వెళ్లాడు. అయితే డబ్బులు ఉన్న బ్యాగ్‌ను తన మోపెడ్‌కు అలాగే తగిలి ఉంచాడు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు ఉన్న బ్యాగును దొంగతనం చేసి అక్కడి నుంచి పారిపోయారు. కేక్ కొనుగోలు చేసి మోపెడ్ వద్దకు వచ్చిన ఆంజనేయులుకు డబ్బులు ఉన్న బ్యాగు లేకపోవడంతో డబ్బులు ఎవరో దొంగిలించారని గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్ శ్వేర్లు తెలిపారు.

కంది కొనుగోళ్లపై రైతుల ఆగ్రహం

- మూడే క్వింటాళ్లు కొంటున్నారు.. మిగతావి ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించిన రైతులు
- అలంపూర్ మార్కెట్‌యార్డులో అన్నదాతల ఆందోళన
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్‌వీ నాయకులు

అలంపూర్ మార్కెట్‌యార్డులో నిరసన తెలుపుతున్న రైతులు

అలంపూర్ చౌరస్తా, ఫిబవరి 4 : మోసపూరిత హామీలు ఇచ్చి తెలంగాణలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుపై అలంపూర్ నియోజకవర్గ రైతులు ఆగ్రహించారు. మంగళవారం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కంది కొనుగోళ్ల తీరుపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. వీరికి బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కుర్వ పల్లయ్య రైతులతో కలిసి మాట్లాడారు. మార్కెట్‌లో కందులకు ధర పడిపోవడంతో మద్దతు ధరకు కొనుగోలుపై కేంద్రం అనుమతి ఇచ్చింది. అయితే ఎకరానికి మూడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రాష్ట్రంలో సగటు దిగుబడి ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, టీడీఆర్ 59రకంతో అలంపూర్ రైతులు ఎకరాకు 10 క్వింటాళ్లు వరకు పండించారని అన్నారు. అయితే సర్కార్ మాత్రం ఎకరానికి మూడు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడంతో మిగతా 7 క్వింటాళ్లు రైతులు ఎక్కడ అమ్ముకోవాలంటూ ప్రశ్నించారు. దీనిపై తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి కొనుగోలు పరిమితిని ఎకరానికి 3 నుంచి 6 క్వింటాళ్ల వరకు పెంచాలని ప్రభుత్వానికి లేఖలు రాయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వేరుశగ, మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఈ పంటల ధరలు బాగా పడిపోవడంతో కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం మిర్చి క్వింటా రూ.25 వేలు పలుకగా ఈ సీజన్‌లో రూ.12 వేలకు పడిపోయిందని వాపోయారు. వేరుశగకు కూడా గడిచిన పదేండ్లలో ఎప్పుడు ఇంత తక్కువ ధర లేదని, మద్దతు ధర రూ.6.783 వేలు ఉండగా వ్యాపారులు రూ.3 నుంచి 5 వేలు ఇవ్వడం ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే అన్ని పంటకు మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, తులసీగౌడ్, ఉరుకుందు, మాధవ్, అలంపూర్ నియోజకవర్గ రైతులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- 24 గంటల్లో నిందితుల పట్టివేత
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నారాయణపేట : హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, ఫిబ్రవరి 4 : నారాయణపేటలో జరిగిన ఓ హత్య కేసును స్థానిక పోలీసులు 24 గంటల్లో ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ లింగయ్య విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లా శీతల్పూర్ గ్రామానికి చెందిన శివరాజ్ ఆయన బామ్మర్ది విక్రమ్ సింగ్, తోడల్లుడు కారు అనే ముగ్గురు వ్యక్తులు గత నాలుగేండ్ల కిందట బతుకుదెరువు కోసం తెలంగాణకు వచ్చి మహబూబ్‌నగర్‌లో టైల్స్‌పని చేస్తూ జీవనం సాగించేవారు. అయితే విక్రమ్‌సింగ్, కారు ఇద్దరు నారాయణపేటలో ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం విక్రమ్ సింగ్ హత్య అయినట్లు కారు అనే వ్యక్తి శివరాజ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. కొంత మంది పండ్ల వ్యాపారం చేసే వ్యక్తులు మినీ స్టేడియంలో విక్రమ్‌సింగ్‌ను కొట్టి హత్య చేసినట్లు శివరాజ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసును దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తా వద్ద గోపి, బాలరాజ్, రాజు, నరేశ్‌కుమార్, మహ్మద్ రఫీక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. గోపి పండ్ల వ్యాపారం చేసేవాడని, తన వ్యాపారం అయిపోయాక రాత్రి సమయంలో పండ్లను మున్సిపల్ కాంప్లెక్స్ గేటు సందులో భద్రపరిచేవాడని డీఎస్పీ తెలిపారు. అయితే కొన్ని సార్లు తన పండ్లను ఎవరో దొంగిలిస్తున్నారని అనుమానించి తన స్నేహితుడు బాలరాజు, తన వద్ద పనిచేసే రాజు, నరేశ్, రఫీక్‌కు తెలియజేసి ద్రువీకరించుకున్నాడు. మళ్లీ దొంగతనానికి వస్తే కొట్టి చంపి ఎక్కడైనా పారబోయాలని నిర్ణయించుకున్నారు. కొట్టడానికి అనుకూలంగా ఐరన్ రాడ్డు, ప్లాస్టిక్ పైపులు పండ్ల భద్రపరిచే స్థలంలో ఉంచారు. ఈ క్రమంలో మృతుడు విక్రమ్‌సింగ్ సోమవారం(3వ తేదీ)తెల్లవారు జామున పండ్లు దాచిన ప్రదేశంలో ఉండడం చూసిన బాలరాజు, పండ్ల వ్యాపారి గోపి, రాజుకు సమాచారం ఇవ్వగా వారు నరేశ్, రఫీలకు సమాచారం ఇచ్చి అక్కడికి పిలిపించుకున్నారు. అందరూ కలిసి విక్రమ్‌సింగ్‌ను బాగా కొట్టగా ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మళ్లీ లేస్తాడేమో అని అనుమానించి ఓ షాపు ముందు పడుకోబెట్టారు. లేవకపోయే సరికి ముందు అనుకున్న పథకం ప్రకారం వ్యాపారి గోపి ఓ ఆటోలో విక్రమ్‌సింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తి తాగి పడి ఉన్నాడని దవాఖానలో చేర్పించారు. అప్పటికే విక్రమ్‌సింగ్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించడంతో భయపడిన గోపితోపాటు మిగిలిన నలుగురు పారిపోయారు. కేసు నమోదైన విషయం తెలుసుకున్న నిందితులు మంగళవారం సత్యనారాయణ చౌరస్తా వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. మృతుడి చంపడానికి వినియోగించిన వస్తువులు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఒక రోజులోనే కేసును ఛేదించిన సీఐ శివశంకర్, ఎస్సై వెంకట్ శ్వేర్లు, పీసీలు రాములు, లింగమూర్తి, ఆంజనేయులును డీఎస్పీ అభినందించారు.